క్లుప్తంగా

గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రఘురాములకోటను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను గ్రామస్తులు కలిసి వినతిపత్రం సమర్పించారు. తిమ్మాపూర్ గ్రామంలో 600 ఎస్సీ జనాభా ఉందని, ప్రజల ఆకాంక్ష మేరకు రఘురాములకోటను గ్రామపంచాయతీ చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు పొందడంలో జాప్యం జరుగుతుందని గ్రామాన్ని నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య



అడ్మిషన్ల కోసం ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెరుగైన విద్య అందుతుందని విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్ అన్నారు. మంగళవారం కళాశాలలో అడ్మిషన్ల కోసం ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రత్యేక ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో డిజిటల్ లైబ్రరీ, క్రీడా సౌకర్యాలు, డిజిటల్ బోర్డులు, జిమ్ అన్ని వసతులున్నాయని, ప్రతి ఒక్కరు ఇందులో చేరాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆడెపు శ్రీనివాస్, కో–ఆర్డినేటర్ రాజు, సాయి మధుకర్ పాల్గొన్నారు.

మిల్క్‌హౌస్‌లు,బేకరీల్లో తనిఖీ



తనిఖీలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కోరుట్ల: పట్టణంలోని మిల్క్ హౌస్‌లు, బేకరీల్లో మున్సిపల్ సిబ్బంది మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్, గడువు ముగిసిన తినుబండారాలను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేహశ్రీకి బెస్ట్ చైల్డ్ అవార్డు



నేహశ్రీ

రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న మల్యాల నేహశ్రీ మంగళవారం హైదరాబాద్‌లో యూట్యూబ్ స్టార్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్‌గా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నేహశ్రీని గ్రామస్తులు అభినందించారు.

ఇసుక వాహనాలు వెళ్లకుండా కందకాలు



కందకం తవ్విస్తున్న రెవెన్యూ అధికారులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండల పరిధిలోని గ్రామాల్లో గోదావరి నుంచి ఇసుకను తరలించడానికి వాహనాలు వెళ్లకుండా రెవెన్యూ అధికారులు జేసీబీతో రోడ్డును మూసివేశారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మంగళవారం గోదావరి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించడంతో తహసీల్దార్ ముంతాజొద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ శ్రీనివాస్, మైనింగ్ అధికారులు జేసీబీలతో కందకాలు ఏర్పాటు చేయించారు. గోదావరి ఒడ్డున 118 టిప్పుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు.

నేడు పెగడపల్లిలో 'అడ్లూరి' పర్యటన

పెగడపల్లి: మండలంలో బుధవారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణ చెక్కులు పంపిణీ చేస్తారని, పేర్కొన్నారు.



యూరియా కష్టాలు..

కథలాపూర్:మండల కేంద్రంలో రైతులు యూరియా కోసం మంగళవారం ఉదయం వేళ చలి గాలుల్లోనూ బారులు తీరారు. వరి, మొక్కజొన్న పంటలకు ప్రస్తుతం యూరియా అవసరమని, 20 రోజులుగా కథలాపూర్‌కు యూరియా సరఫరా కాలేదని రైతులు తెలిపారు. మంగళవారం ఉదయం యూరియా బస్తాల నిల్వలు ఉన్నాయని తెలుసుకున్న రైతులు టోకెన్లు తీసుకునేందుకు వచ్చారు. బస్తాల కోసం ఎగబడ్డారు. ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు స్పందించి మండలంలో యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

పార్లమెంట్‌స్థాయి సమీక్షలో జగిత్యాల ఎమ్మెల్యే



దీపాదాస్ మున్షికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: నిజామాబాద్‌లో మంగళవారం నిర్వహించిన పార్లమెంట్‌స్థాయి సమీక్ష సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఎమ్మెల్యే వెంట జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, రాయికల్ బల్దియా చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ శ్రీనివాస్, బాలె శంకర్ ఉన్నారు.

ఏఈవోలకు సన్మానం

కథలాపూర్: మండలంలో ఏఈవోలుగా పనిచేసి వివిధ మండలాలకు బదిలీపై వెళ్లినవారిని రైతు వేదికలో అధికారులు, రైతులు మంగళవారం సన్మానించారు. ఏఈవోలు ఎం.డీ ఫహీనా, వినీత, వైష్ణవి బదిలీ అయిన విషయం తెలిసిందే. వారి సేవలను పలువురు కొనియాడి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏవో యోగిత, ఏఈవోలు శేఖర్, హరీశ్, రైతు నాయకులు పుర్కుటపు నర్సారెడ్డి, గడ్డం చిన్నారెడ్డి, తిరుమల్‌రెడ్డి, హన్మంత రెడ్డి, తిరుపతిరెడ్డి, గంగారెడ్డి పాల్గొన్నారు.

యాదవులు ఐక్యంగా ఉండాలి



మాట్లాడుతున్న మల్లేశ్ యాదవ్

కథలాపూర్: యాదవులు ఐక్యంగా ఉండాలని, అప్పుడే అన్ని రంగాల్లో అవకాశాలు దక్కుతాయని యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గానవేని మల్లేశ్‌యాదవ్ అన్నారు. మంగళవారం కథలాపూర్ మండలం సిరికొండలో యాదవసంఘం సభ్యత్వ నమోదు ప్రారంభించారు. జనాభా ప్రకారం యాదవులకు రాజకీయ పార్టీలు సీట్లు కేటా యించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామాంజనేయులు, మండ ల ఇన్‌చార్జి మధుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

• ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



చెక్కులు అందిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం టీఎన్జీవో నాయకులు ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, మధుకర్, విద్యాసాగర్‌రావు, శ్రీనివాస్, గణేశ్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

బుగ్గారం: గత ప్రభుత్వం తమకు ఖాళీ ఖజానాను అప్పగించిందని, అయినప్పటికీ తమ ప్రభుత్వం సంక్షేమ పథకాల విషయంలో వెనక్కు తగ్గబోదని ప్రభుత్వ విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుగ్గారం మండల కేంద్రంలో మంగళవారం పలువురు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఇటీవల గల్ఫ్‌లో ఓ కార్మికుడు మరణించగా, బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్వాకం వలన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా సంక్షేమ పథకాల అమలులో వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు.ఇప్పటికే రైతులకు రుణమాఫీ అమలు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాజిద్,ఎంపీడీవో అఫ్జల్‌మియా, డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

• ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పరీక్షప్యాడులు, పెన్నులు అందిస్తున్న విప్

కథలాపూర్: విద్యార్థులకు పదోతరగతి దశ కీలకమని, కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జెడ్పీ హైస్కూల్, మోడల్‌స్కూల్ పదోతరగతి విద్యార్థులకు విద్యార్థులకు పరీక్ష ప్యాడులు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో డీఈవో రాము, ఎంఈవో శ్రీనివాస్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మారంపెల్లి అర్జున్, ఉపాధ్యాయసంఘాల ప్రతినిధులు మామిడిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, శశిధర్, పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

మేడిపల్లి: మండల నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్‌కు, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. తాను గెలిచినప్పటినుండి మేడిపల్లి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నానని తెలిపారు.

'ఆరోగ్య మహిళ' వినియోగించుకోవాలి

• డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్
• మల్లాపూర్ పీహెచ్‌సీ సందర్శన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

మల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తారని, వివిధ పరీక్షలు చేయించుకుని వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బీపీ, షుగర్ బాధితులకు సకాలంలో మందులు అందించాలని సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న సేవలు, మందుల స్టాక్ వివరాలను పరిశీలించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యాధికారి వాహిని, సీహెచ్‌వో రాంమోహన్, హెచ్ఈవో వేణురావు, పీహెచ్ఎన్ ఇందిర, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతి, ల్యాబ్ టెక్నీషియన్ ఉమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొడిమ్యాల మండలాన్ని దత్తత తీసుకుంటా



మాట్లాడుతున్న నరేందర్ రెడ్డి

కొండగట్టు: ఆంధ్ర కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా తెలంగాణ వ్యాప్తంగా అల్ఫోర్స్ కళాశాలలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించానని, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. కొడిమ్యాల మండల కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేట్లు, గ్రామస్తులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన కొడిమ్యాల మండలాన్ని దత్తత తీసుకుంటారని ప్రకటించారు. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చేలా అభివృద్ధి చేస్తానని తెలిపారు. కొడిమ్యాల, మల్యాల మండలాల పరిధిలో ఒక యూనివర్సిటీ, నిరుద్యోగుల కోసం ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండలానికి చెందిన అన్ని పార్టీల నాయకులు, గ్రాడ్యుయేట్లు గ్రామస్తులు, కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ వ్యాఖ్యలు హాస్యాస్పదం'

గొల్లపల్లి: తెలంగాణలో అధికారంలోకి రావడానికి ఆరు గ్యారంటీల పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఎప్పుడైనా అమలు చేయవచ్చని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మరిపెల్లి సత్యం అన్నారు. గొల్లపల్లిలో మంగళవారం మాట్లాడారు. గత ప్రభుత్వం హామీల అమలులో విఫలం అయినందునే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ఆరు గ్యారంటీలలో మూడు గ్యారంటీలు సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ధర్మపురి మాజీ అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం, బీజేపీ మండల అధ్యక్షుడు కట్ట మహేశ్, నాయకులు అనుమాండ్ల రాఘవరెడ్డి, ఉట్కూరి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల: యూటీఎఫ్ రూపొందించిన క్యాలెండర్‌ను డీఈవో రాము మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్, భూమేశ్వర్, సుశీల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో వీడీసీ సభ్యులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని ఎస్సై అనిల్ అన్నారు. మంగళవారం మండలంలోని గోధూర్ వీడీసీ సభ్యులు ఎస్సై అనిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి మొక్క అందజేశారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని సభ్యులకు సూచించారు.

కార్మిక నాయకుల మృతి పట్ల సంతాపం

కోరుట్ల రూరల్: ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం, హమాలీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు మాదినం లక్ష్మయ్య, మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు ఓరుగంటి పోశవ్వ మృతి పట్ల ఏఐటీయూసీ నాయకులు సంతాపం తెలిపారు. ఈ మేరకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు మాట్లాడుతూ కార్మిక నాయకుల మృతి కార్మిక సంఘాలకు తీరని లోటన్నారు. కార్మికుల సమస్యలు,హక్కుల పట్ల వారు నిరంతరం పోరాటాలు చేశారని కొనియాడారు.

గడవంశీయుల గుర్తింపుపై హర్షం

రాయికల్: పలుకలేని విధంగా ఉన్న కులాల పేరును గడవంశీయులుగా గుర్తిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడం పట్ల మంగళవారం రాయికల్ గడవంశీయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద రమేశ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి తమ కులం పేరును మార్చడం కోసం దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ కుర్సెంగ వేణు, గడవంశీకులు చంద పాపయ్య, పోచయ్య, వేణు, విష్ణు, సురేశ్ పాల్గొన్నారు.

వంట పాత్రల పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 24 మధ్యాహ్న భోజన ఏజెన్సీల ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండుతున్నారు. దీని కోసం ప్రభుత్వం నుంచి వచ్చిన వంట పాత్రలను మంగళవారం పాఠశాలల హెచ్ఎంలకు ఎంఈవో మధు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు శివరాం, రవీందర్, ఎంఐఎస్ కార్తీక్, అశోక్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

ఎంపీవో విచారణ

గొల్లపల్లి: మండలంలోని రాపల్లి గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన లేయర్ ఫాం యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు, రైతుల ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ సత్యప్రసాద్ విచారణకు ఆదేశించగా, మంగళవారం గొల్లపల్లి ఎంపీవో సురేశ్‌రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి బహిరంగంగా విచారించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల/ఇబ్రహీంపట్నం/పెగడపల్లి:మల్యాల మండలంలోని నూకపల్లి మోడల్ స్కూల్, ఇబ్రహీంపట్నం మోడల్‌స్కూల్, పెగడపల్లి మోడల్ స్కూళ్లలో 6వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయా స్కూళ్ల ప్రిన్సిపాళ్లు ఆదిత్య, ప్రభాకర్, ప్రభాకర్ రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఏడో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న ఉంటుదని పేర్కొన్నారు.

అంజన్న నిత్యపూజను గుట్ట కిందకు వినిపించండి

కొండగట్టు: కొండగట్టు అంజన్నకు ప్రతిరోజూ నిర్వహించే పూజలను మైకుల ద్వారా గుట్ట కిందకు వినిపించేలా ఆలయ అధికారులు ఏర్పాటు చేయాలని కొండగట్టుకు చెందిన భారతం శ్రీనివాస్ ఆలయ ఏఈఓ వైరాగ్యం అంజయ్యకు వినతిపత్రం అందించారు. గతంలో ఆలయంలో ఆరగింపు పూర్తయ్యాక భక్తులందరికీ అర్చకులు తీర్థ ప్రసాదం అందించి ఆశీర్వచనం ఇచ్చేవారని, ఆ కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగించేలా చూడాలని వినతిపత్రంలో కోరారు.

ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్



మాట్లాడుతున్న నక్క సతీశ్

జగిత్యాలటౌన్: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు, వేయి గొంతుకల ప్రదర్శనను విజయం చేసేందుకు బహుజనులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు నక్క సతీష్ మాదిగ కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సతీశ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ 30ఏళ్ల పోరాటమన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేంతవరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోకన్వీనర్ పాడేటి సునీల్, రాయికల్ మండల అధ్యక్షుడు దొబ్బల వేణుగోపాల్, అర్బన్ గౌరవ అధ్యక్షుడు సంగెపు ముత్తు తదితరులు పాల్గొన్నారు.



కథలాపూర్: కోరుట్ల- వేములవాడ రహదారిలో కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామశివారులో తారు రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. వాహనదారులు గమనించకుండా వెళ్లడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. బస్సులు, కారుల డ్రైవర్లు గుంతను చూసి అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు చొరవ చూపి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లక్ష్మీకాంత్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, కథలాపూర్. సెల్ నంబర్: 7702537843

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కోరుట్ల: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాయంలో వినతిపత్రం అందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, బీసీలకు ప్రతీ ఏడాది 20 వేల కోట్లు బడ్జెట్లో కేటాయిస్తామని అమలు కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కారని పేర్కొన్నారు. హామీలు అమలు చేయకుంటే ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ యాదగిరి బాబు, అసెంబ్లీ కన్వీనర్ యాదగిరి బాబు, అధికార ప్రతినిధి వడ్డెపల్లి శ్రీనివాస్, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణ అధ్యక్షులు బింగి వెంకటేష్, బొడ్ల రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లి: ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు చేసి బీసీలకు న్యాయం చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఏడాదికి రూ. 20 వేల కోట్లు ఆర్థిక బడ్జెట్ కేటాయిస్తామని ఇచ్చిన హామీకి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉండాలని కోరుతూ తహసీల్దార్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మండల అధ్యక్షుడు మల్లేశం, బీజేపీ అధ్యక్షుడు కొమురెల్లి, ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు కిశోర్, నాయకులు పాల్గొన్నారు.

• బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన దొనకొండ చంద్రయ్య మృతి చెందగా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం పరామర్శించారు. బాధితకుటుంబానికి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. తాటిపల్లి గ్రామానికి చెందిన సుంకపాక హన్మయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు, రామన్నపేటలో క్యాతం మల్లేశం ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆనందరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

• అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

మెట్‌పల్లిరూరల్:అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. మంగళవారం ఆర్డీవోను కలిశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మీ, సుమలత, రోదసి, లావణ్య, షమీంసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

• టీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గాదె శ్రీనివాస్

ధర్మపురి: తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధర్మపురికి చెందిన గాదె శ్రీనివాస్ నియమితులయ్యారని టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మునిగాల మణిపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాదె శ్రీనివాస్ ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేసారు.

• ఇసుక డంపులు సీజ్

మెట్‌పల్లిరూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు మెట్‌పల్లి మండలం ఆత్మనగర్ గ్రామంలో సీజ్ చేశారు. ఆర్‌ఐ ఉమేశ్ గ్రామానికి వెళ్లగా ఓ చోట సుమారు 10 ట్రిప్పుల ఇసుక డంపులు ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు.

• నాయీ బ్రాహ్మణ సంఘం కార్యవర్గం

కథలాపూర్: నాయీ బ్రాహ్మణ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కథలాపూర్ మహేశ్, ప్రధానకార్యదర్శిగా చెట్‌పల్లి ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా చింతకుంట నర్సయ్య, కోశాధికారిగా రాసమల్ల రాజేశ్, సలహాదారుడిగా చెట్‌పల్లి అంజయ్య, గౌరవాధ్యక్షుడిగా సామనపెల్లి రవీందర్ ఎన్నికయ్యారు.

• విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని హైదర్‌పల్లి 220 కేవీ సబ్‌స్టేషన్‌లో నూతన విద్యుత్ లైన్ నిర్మాణం జరుగుతుండడంతో ఈనెల 9 నుంచి 19 వరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ నాయక్ తెలిపారు. పూడూరు, గంగాధర, కోరుట్ల, కథలాపూర్, గోదూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో త్రిఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదని పేర్కొన్నారు.